సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 28 । జనవరి । 2024



పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



సిద్ధం సభకు భారీగా తరలివచ్చిన జనసందోహంలో ఓ భాగం

సై జగనన్నా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలగం.. దండులా కదిలివచ్చింది. జననేతను చూడ్డానికి.. వీలైతే మాట్లాడ్డానికి.. అవకాశం దొరికితే కరచాలనం చేయడానికి యువకులు, యువతులు, మహిళలు పోటెత్తారు. ఉత్తరాంధ్ర దారులన్నీ 'సిద్ధం' సభ వైపు కదలగా.. బంగాళాఖాతం చెంత జన సునామీ చుట్టేసింది. లక్షల గొంతుకలు ఒక్కటై.. జగన్ కావాలి.. మళ్లీ జగనే రావాలి అంటూ నినదించడంతో సాగరఘోష చిన్నబోయింది. వందలాదిగా బస్సులు.. వేలాదిగా కార్లు, ఆటోలు.. ఇలా అనేక వాహనాలతో వచ్చిన ప్రజలతో సంగివలస ప్రాంతం జనసంద్రమైంది. విశాఖ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన సభతో ఉత్తరాంధ్ర ఉప్పొంగగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాటలు జనం గుండెలను తాకాయి. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాయి. రణరంగంలో మేము సైతం 'సిద్ధం' అంటూ పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో అధినేతకు జై కొట్టారు.

– సాక్షి, విశాఖపట్నం, తగరపువలస



ర్యాంప్ పై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

- వైఎస్సార్ సీపీ కుటుంబ సమావేశంలో ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం వైఎస్ జగన్
- చేసిన మేలు ప్రతి గడపకు వెళ్లి వివరించాలని దిశానిర్దేశం
- కార్యకర్తలలో ఉత్సాహం నింపిన ముఖ్యమంత్రి
- ఎన్నికల యుద్ధానికి సిద్ధం'అంటూ నినదించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సీఎం పిలుపుతో సమరోత్సాహంతో కదిలిన ఉత్తరాంధ్ర

భీమిలి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించారు. నియోజకవర్గంలోని సంగివలస వద్ద జరిగిన 'సిద్ధం' సభకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 34 నియోజకవర్గాల నుంచి పార్టీ కేడర్ అంతా కదిలి వచ్చింది. గత సమావేశాల కంటే భిన్నమైన 'సిద్ధం' సభ లక్షలాది జనంతో కిక్కిరిసిపోయింది. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీలు, చేసిన దుర్మార్గాలను ఎండగడుతూ.. వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై జరిగిన సభలో సీఎం జగన్ చేసిన ప్రసంగానికి ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. 56 నెలల పాలనలో అందించిన సంక్షేమాభివృద్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని.. దుష్టచతుష్టయంపై సోషల్ మీడియా వేదికగా పోరాడాలని ఇచ్చిన పిలుపు పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది. గ్రామాల చెంతకే ప్రభుత్వ పాలన, విద్య, వైద్యం తీసుకొచ్చామని.. మీ జగనన్న చెప్పినట్లుగా ప్రతి పేదోడి ఇంటికి వెళ్లి మనం చేసిన మంచిని వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరో 70 రోజుల్లో రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో యుద్ధానికి సిద్ధం కావాలని ఆయన పార్టీ కేడర్‌ను సమాయత్తం చేశారు. బిగ్ ర్యాంప్‌పై నుంచి నడుచుకుంటూ ప్రజలకు అభివాదం చేశారు. జై జగన్.. మళ్లీ సీఎం వైఎస్ జగన్ అనే నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. రానున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి మేము సైతం సిద్ధం అంటూ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు గట్టి మద్దతు తెలిపారు. 75 నిమిషాల పాటు సీఎం ప్రసంగించగా.. ఆయన మాట్లాడుతున్నంత సేపు ''వుయ్ వాంట్ సీఎం.. వన్స్ మోర్ సీఎం''.. ''ఎన్నికల యుద్ధానికి సై..'' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. లబ్ధి పొందిన ప్రతీ కుటుంబం నుంచి స్టార్ క్యాంపెయినర్లు రావాలని సీఎం పిలుపునివ్వగా.. మేము సిద్ధం అంటూ జెండాలు పైకెత్తి.. సై అన్నారు.

సభ జరిగిందిలా..

మధ్యాహ్నం 3 గంటల నుంచే పలువురు మంత్రులు, నేతలు కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. తొలుత పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ప్రసంగించారు. అనంతరం డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మంత్రి ధర్మాన ప్రసాదరావు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయం నుంచి 3.55 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. సాయంత్రం 4.10 గంటలకు ప్రసంగం ప్రారంభించారు. 5.25 గంటల వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రతి కుటుంబానికి వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల శంఖారావం పూరించారు. అక్కడ నుంచి 10 నిమిషాల పాటు బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నుంచి కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ నడిచారు. సభ పూర్తయిన తర్వాత తిరిగి సంగివలస వద్ద హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 5.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.



సిద్ధం ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న పార్టీ కార్యకర్తలు

పాల్గొన్న ప్రముఖులు

బహిరంగ సభలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్లు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్న దొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు విడదల రజని, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, బొడ్డేడ ప్రసాద్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ, శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జిల్లా పరిషత్ చైర్మన్లు జె.సుభద్ర, పిరియ విజయ, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్, డాక్టర్ పి.సురేష్‌బాబు, రఘురాజ్, కుంభా రవిబాబు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గొల్ల బాబూరావు, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, పాముల పుష్పశ్రీ వాణి, వాసుపల్లి గణేష్ కుమార్, యూవీ రమణమూర్తిరాజు, కంబాల జోగులు, కడిబండి శ్రీనివాసరావు, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కంబాల జోగులు, సమ్మంగి చిన అప్పలనాయుడు, అలజంగి జోగారావు, విశ్వసరాయి కళావతి, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు డాక్టర్ కలే రాజేష్, దువ్వాడ శ్రీనివాస్, మలసాల భరత్ కుమార్, ఉరుకూటి రామచంద్రరావు, రాష్ట్ర, జిల్లా కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, శోభాస్వాతిరాణి, పిల్లా సుజాత, చొక్కాకుల వెంకటరావు, మాధవీ వర్మ, కొండా రాజీవ్ గాంధీ, కె.వి.బాబా, ప్రభుత్వ సలహాదారుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు ధనుంజయ్‌రెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ ప్రభుత్వ సలహాదారుడు మిలీనియం శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యకర్తల కోఆర్డినేటర్ పుత్తా ప్రతాప్ రెడ్డి, నవరత్నాల వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణ మూర్తి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు, రొంగలి జగన్నాథం, చిక్కాల రామారావు, ఐహెచ్ ఫరూఖీ, చింతలపూడి వెంకట్రామయ్య, కాశీ విశ్వనాథం, శ్రీనివాసరెడ్డి, వీసం రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామ సుబ్బారావు, పీలా ఉమా రాణి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు శ్రీవత్సవ్, రవిరెడ్డి, ముఖ్య నాయకులు, రాష్ట్ర, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మేము సైతం సిద్ధం..

సైనికుల్లా పనిచేద్దాం



భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే ఉత్సాహం.. స్ఫూర్తితో ముందుకు సాగుదామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. మరోమారు పార్టీని గెలుపించుకుందామన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ఛేదించేందుకు అంతా ముఖ్యమంత్రి వెంట నడిచి పోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు.

ఆత్మీయ స్వాగతం.. వీడ్కోలు



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: 'సిద్ధం'భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం మధ్యాహ్నం 3.12 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవిపుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం విశాఖ విమానాశ్రయం నుంచి 3.26గంటలకు హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి బయలుదేరి భీమిలి మండలం సంగివలస వద్ద హెలీప్యాడ్ కు చేరుకున్నారు. అక్కడ నుంచి సభాస్థలి వద్దకు 3.55 గంటలకు చేరుకున్నారు. బహిరంగ సభ ముగిసిన తర్వాత తిరిగి హెలీప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 5.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ ప్రజా ప్రతినిధులు, జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సీఎంకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.



సాంస్కృతిక ప్రదర్శనలతో ఉర్రూతలూగిస్తున్న వంగపండు ఉష బృందం



పెత్తందారుల కటౌట్‌లు

క్లుప్తంగా

డొంకరాయి పవర్ కెనాల్‌కు రంధ్రం

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించిన అధికారులు



మరమ్మతుల్లో నిమగ్నమైన సిబ్బంది

మోతుగూడెం: డొంకరాయి పవర్ కెనాల్‌కు సింధువాడ గ్రామ సమీపంలో 2/4 రీచ్ యూటీ వద్ద శుక్రవారం రాత్రి రంధ్రం ఏర్పడటంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే కెనాల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. సిమెంట్ గ్రౌటింగ్ పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్ శనివారం మాట్లాడుతూ రీచ్‌కు ఏర్పడిన రంధ్రాన్ని శుక్రవారం అర్ధరాత్రి జెన్‌కో పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించారన్నారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన మేరకు ఉదయం నుంచి మరమ్మతు పనులు చేపట్టామని తెలిపారు. శనివారం రాత్రికి ఎలాగైనా పనులు పూర్తి చేసి కెనాల్ ద్వారా నీటిని యథావిధిగా విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ రాహుల్ మీనా

మోతుగూడెం: గిరిజన యువత చెడు వ్యవసానాలకు దూరంగా ఉండాలని చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా అన్నారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డొండగూడెం గ్రామాన్ని శనివారం సందర్శించారు. అక్కడ గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వీటిని ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల్లో ఎవరైనా గొడ వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వృద్ధులకు దుప్ప ట్లు పంపిణీ చేశారు. ఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

అరకు టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- తిరుగుబాటు అభ్యర్థి సివేరి అబ్రహానికి మద్దతు
- తీర్మానించిన మండల నాయకులు



రెబల్ అభ్యర్థి అబ్రహానికి మద్దతు తెలుపుతున్న అనంతగిరి మండల టీడీపీ నేతలు

అనంతగిరి: అరకు నియోజకవర్గం టీడీపీలో వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. ఈనెల 20వ తేదీన డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ వద్ద టీడీపీ పార్టీ రా కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సివేరి దొన్నుదొరను ప్రకటించారు. దీంతో అప్పటి నుంచి ఆ పార్టీలో అసంతృప్తి సెగలు రగులుతూనే ఉన్నాయి. టీడీపీ కోసం ఆహర్నిశలు శ్రమించిన వారిని పక్కనపెట్టారంటూ ఆపార్టీ నేతలు బహిరంగంగానే ధ్వజమెత్తారు. పార్టీ టికెట్ ఆశించిన సివేరి అబ్రహానికి కేటాయించకపోవడంతో ఆయన వర్గం అప్పటినుంచి అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని చిలకలగెడ్డ వద్ద సుమారు వంద మంది టీడీపీ మండల నేతలు సమావేశమయ్యారు. అన్యాయం జరిగిన టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహానికి మద్దతు తెలపాలని తీర్మానించారు. అతనిని గెలిపించి పార్టీ అధిష్టానానికి తమ సత్తా చూపుతామని ప్రకటించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని, ఈ విషయంలో తగ్గేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఉపాధ్యక్షులు కె.అప్పారావు, ఎస్.దొన్ను, నగేశ్వరరావు, కళారాజు, కృష్ణ, లక్ష్మణరావు, సోము పాల్గొన్నారు.

లేబర్ సెస్సు జమ తప్పనిసరి

సాక్షి,పాడేరు: ప్రభుత్వ,ప్రైవేట్ భవన నిర్మాణ యాజమానులు నుంచి ఒక శాతం లేబర్ సెస్సును విధిగా వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలు చేపట్టే యాజమానులు మార్కెట్ విలువ ప్రకారం ఒకశాతం సెస్సును తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. కార్మికశాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు సెస్సు వసూలు, చెల్లింపుపై అవగాహన కలిగించాలన్నారు. ఇంజనీరింగ్‌శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న ఒకశాతం సెస్సు మొత్తాన్ని వెంటనే కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విశాఖ కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత మాట్లాడుతూ పనులు చేస్తున్న అన్ని ఇంజనీరింగ్‌శాఖలు ప్రతినెలా కార్మికశాఖకు నివేదికలు అందజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: జాతీయ రహదారి 516ఇ విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం నాలుగు మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రంపచోడవరం ట్రాన్స్‌కో ఈఈ ఎండీ యూసఫ్ తెలిపారు. ఈ మేరకు అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

- విద్యార్థిని పరిస్థితి విషమం
- ఆస్పత్రికి తరలింపు



తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని

ముంచంగిపుట్టు: మండలంలో గల జోలాపుట్టు పంచాయితీ బొంద్రుగూడ ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం తేనెటీగల దాడిలో విద్యార్థిని, ఇద్దరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్నసమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. విద్యార్థిని బి.దేవి (10), వంటకుక్క బుద్దాయి, వాచ్‌మెన్ సొన్ను తీవ్రంగా గాయపడ్డారు. మరికొంత మంది విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన దేవి, బుద్దాయి, సొన్నులను ఉపాధ్యాయులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో లబ్బూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. వైద్యాధికారి ప్రతాప్ వైద్యసేవలు అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న దేవిని అంబులెన్సులో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారిణి గీతాంజలి పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నారు.

పనసపుట్టు పాఠశాలలో..

పనసపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలోనూ శనివారం మధ్యాహ్నం విద్యార్థులు,ఉపాధ్యాయులపై తేనెటీగలు దాడి చేశాయి. పాఠశాల సమీపంలో ఉన్న చెట్ల నుంచి తేనెటీగలు ఒక్కసారిగా పాఠశాలలోకి రావడంతో విద్యార్థినులు గదుల్లోకి వెళ్లి తలుపులు మూసుకున్నారు. గాయపడిన విద్యార్థినులు అను, సుకన్య, పూజా, రమణి, శైలు, సువర్ణ, అనిత, అఖిల, దేవి, నీలమ్మ, రాధిక, ధనేశ్వరి, భానుప్రియ, ఉపాధ్యాయుడు చలపతిని లబ్బూరు పీహెచ్‌సీకి తరలించారు. వీరికి స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పాడేరు/చింతూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 31న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ వేర్వేరుగా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఐటీ, ఫార్మా, రిటైల్, మెడికల్, ఆటో మొబైల్, ఇతర రంగాలకు చెందిన 84 కంపెనీలతో రీజనల్ జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకులు పాన్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని వారు కోరారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు రూ 10 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పూర్తి వివరాలకు 6304634447లో సంప్రదించాలన్నారు.

వంటగ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ కార్తీక్



పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని, అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వంట గ్యాస్ సరఫరా చేసే ఎల్‌పీజీ డీలర్లంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఇటీవల కాలంలో ఎల్‌పీజీ డీలర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. బిల్లుపై ఉన్న మొత్తం కంటే పైసా కూడా వినియోగదారులు ఇవ్వొద్దని ఆయన సూచించారు. అధిక సొమ్ము వసూలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి గ్యాస్ ఏజెన్సీల డీలర్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక చార్జీలు వసూలు చేస్తే సంబంధిత అధికారులకు లేదా 1967 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 18002333555కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ బరువుపై అనుమానం ఉంటే వినియోగదారుడి సమక్షంలో సీలు తీసి చూపించాల్సిన బాధ్యత డెలివరి బాయ్స్‌పై ఉందన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు గ్యాస్ ఏజెన్సీలపై తనిఖీలు నిర్వహించి గ్యాస్ పంపిణీపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



రక్తదానం చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 13 యూనిట్ల సేకరణ

సాక్షి,పాడేరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మూడవ సారి రక్తదానం చేసిన ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణాపాయంలో రోగులను ఆదుకునేందుకు రక్తం ఎంతో అవసరమన్నారు. శిబిరాల్లో సేకరించిన రక్తాన్ని రోగులకు ఉపయోగిస్తున్నామని చెప్పారు. జిల్లాకు రక్తనిల్వలు అవసరమని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు మండల కేంద్రాలతో పాటు,సచివాలయాల పరిధిలోను నిర్వహించాలన్నారు. శిబిరంలో 12 మంది నుంచి 13 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. డీఆర్వో రమణ, ఎస్‌డీసీ మురళీ, తహసీల్దార్ చిన్నికృష్ణ, రెడ్‌క్రాస్ డాక్టర్ రాజీవ్, ఇతర ప్రతినిధులు లోహితాస్, సుర్యారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో గౌరీశంకరరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

కొయ్యూరు: మండలంలోని పెదమాకవరం సమీపంలో శనివారం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న యజమాని సీహెచ్ నాగేశ్వరరావు (45) మృతి చెందాడు. కాకినాడకు సమీపంలో పెదపూడికి చెందిన ఆయన ఏటా ట్రాక్టర్‌తో వరి నూర్పిడి పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తుంటారు. దీనిలో భాగంగానే మండలానికి వచ్చిన ఆయన శనివారం ట్రాక్టర్‌తో వరి నూర్పిడిని పూర్తి చేశారు. అనంతరం ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకువెళ్తుండగా అదుపుతప్పి బోల్తా కొట్టడంతో దానికింద ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



నాగేశ్వరరావు మృతదేహం

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు తరగతులు

సాక్షి,పాడేరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023లో ప్రవేశాలు పొందిన బీఏ విద్యార్థులకు ఈనెల 28 నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి తెలిపారు.ఫిబ్రవరి 4,11,25,మార్చి మూడు తేదీల్లో జరిగే తరగతులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందిన ద్వితీయ, తృతీయ సంవత్సరాల అభ్యర్థులు ట్యూషన్, సెమిస్టర్ పరీక్ష ఫీజులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆయన కోరారు. అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఇంటర్, ఐటీఐ,డిప్లమో, పాలిటెక్నిక్ పూర్తిచేసిన అభ్యర్థులతో పాటు ఓపెన్ ఇంటర్ పాసైన అభ్యర్థులు కూడా అంబేడ్కర్ ఓపెన్‌వర్సిటీలో ప్రవేశాలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9490458695, 7382929728, 9494372020 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

భోజన నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

చింతూరు: యూత్ ట్రెనింగ్ సెంటర్ ఎటపాకలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు భోజన సదుపాయం నిమిత్తం అర్హుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎటపాక వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతకు స్వల్పకాల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ పొందుతున్న యువతకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, రెండుమార్లు స్నాక్స్ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఇందుకోసం ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘం, సంఘాల నుంచి స్వల్పకాలిక టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాల్లోని ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోని టెండర్ బాక్స్ నందు టెండర్లు దాఖలు చేయాలని పీవో పేర్కొన్నారు. దాఖలైన టెండర్లను 4వ తేదీ ఉదయం 10 గంటల వరకు స్వీకరిస్తామని, అనంతరం వచ్చినవి తీసుకోవబడవని తెలిపారు. ఈనెల 29 నుంచి ఐటీడీఏ కార్యాలయంలో రూ.100 చెల్లించి టెండర్ ఫారాలు పొందవచ్చని, టెండర్ పొందిన వారు ధరావతు కింద రూ.50 వేలు డిపాజిట్ చేయాలని, ఆరు నెలల కాలపరిమితికి అగ్రిమెంటు చేసుకోవాలని పీవో ప్రకటనలో పేర్కొన్నారు.